త్వరలో టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని పేదల కోసం పెంకుళ్లపాడులో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను మరో 2 వేల మంది లబ్ధిదారులకు త్వరలో అందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పాలకొల్లు పట్టణంలోని 22వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులతో శ్రీనివాస్ స్వయంగా మాట్లాడారు. వలంటీర్లు సక్రమంగా పని చేస్తున్నారా?, పింఛన్ సక్రమంగా అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. పింఛన్ డబ్బులు ఎవరు పంపిస్తున్నారని వృద్ధురాలు సత్తెకాలెపు సీతమ్మను శ్రీనివాస్ ప్రశ్నించగా జగన్ బాబు పంపిస్తున్నారని సమాధానం చెప్పింది. 22వ వార్డులోని పలు వీధులు పల్లంగా మారాయని, దీంతో వర్షం నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని శ్రీనివాస్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై మునిసిపల్ డీఈకి పలు సూచనలు ఇస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేసి మునిసిపల్ సాధారణ నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి వైఎస్సార సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వార్డు ఇన్‌చార్జ్ పిల్లా శ్రీనివాస్, వార్డు నాయకులు యాదంరెడ్డి శ్రీనివాస్, బొమ్మన నాగేశ్వరరావు, అల్లం మురళి, డోలా నరసింహారావు, మద్దాల గణేష్, దేశంశెట్టి రాము, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, మామిడి బాబు, గోరింటాడ సొసైటీ అధ్యక్షుడు వర్ధినీడి విజయ శ్రీనివాస్, మద్దా చంద్రకళ, కడలి రామలక్ష్మి, జోగాడ ఉమామహేశ్వరరావు, తలుపుల భుజంగరావు, యలకల రంగ, శంకరాపు శ్రీను, జమ్ము కాశి తదితరులు పాల్గొన్నారు.


పాలకొల్లులోని 22వ వార్డులో మహిళతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

సీతారామచంద్రస్వామి ప్రచార రథంతో గ్రామోత్సవం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని యడ్లబజారు సెంటర్ శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుండి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల కళ్యాణ రథంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అభయ గణేష్, అభయ ఆంజనేయ స్వామివార్ల ఆలయం నందు ఆదివారం హనుమత్ జయంతి సందర్భంగా 108 మంది దంపతులచే శ్రీ సీతారామచంద్రస్వామివార్ల కళ్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం భద్రాచలం నుంచి తీసుకువచ్చిన శ్రీసీతారామచంద్ర స్వామి కళ్యాణ రథంతో పాలకొల్లు నుంచి జిన్నూరు వరకూ ఊరేగింపు కొనసాగించారు. ముందుగా పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్వామివారి రథానికి ఆలయ అర్చకులు రమణస్వామి హారతులిచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధర్మపరిరక్షణా సమితి అధ్యక్షులు గాదె వెంకన్న, కోరాడ శ్రీనివాసరావు, జక్కంపూడి కుమార్, కె.వి కృష్ణవర్మ, ప్రసాద్, శేఖర్, శీరం ఆనందకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సావాల ప్రారంభం

పోడూరు: మండలంలోని జిన్నూరు గ్రామంలో 22 దేవాలయ కమిటీలు, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ, అధ్యాత్మికవేత్త, గ్రామ ప్రముఖులు డీటీడీసీ బాబు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో హనుమద్ జయంతి ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. ఉదయం జిన్నూరు ఐడియల్ స్కూల్‌లో హనుమాన్ చాలీసా పారాయణ పోటీలు నిర్వహించారు. సాయంత్రం భద్రాచలం రాములవారి రథోత్సవాన్ని మండలంలో భూపయ్య చెరువు, శ్రీ ముఖదారమ్మ ఆలయం నుంచి ప్రారంభించి గ్రామంలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామి వార్లకు పంచామృతాభిషేకం, 9 గంటల నుంచి స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


భద్రాచలం రాములవారి రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు, కమిటీ సభ్యులు

క్లుప్తంగా

ఐటీఐ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సర ప్రవేశాలకు గానూ మొదటి విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యిందుకూరి వెంకట సత్యనారాయణరాజు తెలిపారు. ఐటీఐలో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసి ప్రింట్‌ను, ధ్రువపత్రాల కాపీల నకళ్లను జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రభుత్వ ఐటీఐ ఆచంటలో అందించాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 94901 11002కు ఫోన చేయాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన


కొడమంచిలిలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సీతారాం

పెనుగొండ: ఉపాధి హామీ పనులు పేదల పాలిట వరమని, ఉపాధి పనులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శనివారం కొడమంచిలి చిన పేటలో జరుగుతున్న ఉపాధి పనులను పంచాయతీ సభ్యుడు పుచ్చకాయల నాగార్జునతో కలిసి పరిశీలించారు. వారి వెంట ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కోటి శశి మధు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు


ప్రమాదంలో చేలోకి వెళ్లిన ఇన్నోవా కారు

పోడూరు: రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని వేడంగి శివారు ప్రాంతంలో జరిగింది. శనివారం వేడంగి గ్రామం శివారులో పాలకొల్లు మార్టేరు రహదారిపై జరిగిన ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. పాలకొల్లు నుంచి మార్టేరు వైపు వెళుతున్న కారు ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను, మోటర్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, మోటర్‌సైకిల్ రోడ్డు పక్కన ఉన్న పంట చేలలోకి దూసుకుపోయాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి, కారులో ప్రయాణిస్తున్న ఒకరికి, మోటర్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో గాయపడిన వారిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'సోషల్ మీడియాలో ఫేక్ వార్తలు వస్తున్నాయ్'

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను సోషల్ మీడియా నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. శనివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో అనేక ఫేక్ న్యూస్‌లు వస్తున్నాయని, అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం భావ్యం కాదని చెప్పారు. శుక్రవారం తన పేరుతో సోషల్ మీడియాలో ఓ ఫేక్ న్యూస్ వచ్చిందని ఈ సందర్భంగా తెలిపారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు రావడం సహజమేనని, దానిని పెద్దగా పట్టించుకోవడం లేదని చెప్పారు. తన సంతకం లేకుండా, తన నోటి నుంచి ఎటువంటి వ్యాఖ్యలూ రానటువంటి వార్తలను ప్రచారం చేయొద్దని కోరారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామ పరిధిలోని కాపులకొడపలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. వేంకటేశ్వరునికి ప్రీతిప్రాదకమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

సీఎం జగన్‌కి బాసటగా నిలవాలి

వీరవాసరం: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతీ ఒక్కరూ బాసటగా నిలవాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు కోరారు. వీరవాసరం మండలంలో శనివారం జగనన్న మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గ్రామ గ్రామాన మద్దతుగా నిలవడం అభినందనీయమని కోటిపల్లి బాబు అన్నారు. వీరవాసరం, రాయికుదురు, మడుగు పోలవరం, నేలపోగుల, బీజే పాలెం, తోలేరు తదితర గ్రామాల్లో గ్రామ కన్వీనర్లు, ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రికార్డు స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు

నరసాపురం: దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి వచ్చే ఏడాది మార్చి వరకూ ప్రభుత్వం అమలు చేసే సంక్షమ కార్యక్రమాల వివరాలతో కూడిన క్యాలెండర్‌ను శనివారం ముదునూరి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో ప్రభుత్వం ఏ పథకం ద్వారా లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చనుందో? తెలియజేస్తూ సంక్షేమ క్యాలెండ్‌ను విడుదల చేస్తున్నామని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ కార్రక్రమాలు అమలు చేస్తుంటే అప్పులు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సమష్టి కృషి

నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రాంతాల వారీగా మౌలిక వసతుల కల్పనకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. శనివారం సాయంత్రం ముదునూరి తన కార్యాలయంలో పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధిపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన నిధులతో చేపట్టిన పెండింగ్ పనులు ఈ వేసవి పూర్తయ్యేలోపు పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ పాల్గొన్నారు.


సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

బాధితులకు పరామర్శలు

పెనుగొండ: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం వడలిలో పలు కుటుంబాలను పరామర్శించారు. షుగర్ వ్యాధితో కుడికాలు కట్ చేసిన గుమ్మడి పులిని, పచ్చివాతానికి గురైన పాలూరి సూర్యనారాయణను, రోడ్డు ప్రమాదానికి గురైన పాలూరి సూర్యనారాయణ కొడలిని, పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మి, ఎంపీటీసీ రెడ్డి గణేశ్వరరావు, చిటికెన విజయబాబీ, రంభ సూర్యనారాయణ, కూన సూర్యప్రకాశ్, మద్దు శ్రీనివాసరావు, బండారు దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మార్టేరు నెగ్గిపూడి గ్రామాల్లో ఇటీవల అకాల మృతిచెందిన మార్టేరు జగనన్న కాలనీ భూదాత పిసిని గంగాభవానీ, నెగ్గిపూడి పంచాయితీ పారిశుద్ధ్య కార్మికుడు పులిదిండి చినబాబు కుటుంబ సభ్యులను శనివారం సాయంత్రం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. గంగాభవానీ మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా నెగ్గిపూడి గ్రామంలో స్వీపర్ చినబాబు కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తామని, కుమారులు ఇద్దరిని గురుకుల పాఠశాలలో చేర్పించి, కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట మార్టేరు, నెగ్గిపూడి సర్పంచ్‌లు మట్టా కుమారిరాము, మామడిశెట్టి ధనలక్ష్మి, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.


మార్టేరులో గంగాభవానీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న రంగనాథరాజు

ఎమ్మెల్యే రంగరాజుకు కాపు నేతల సత్కారం

పెనుగొండ: తూర్పుపాలెంలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సమస్యను విన్నవించుకోగానే సత్వరం పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును తూర్పుపాలెం అభ్యుదయ కాపు సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. శనివారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయం వద్ద కాంక్రీట్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.4 లక్షల నిధులతో అంచనాలు తయారు చేసి, పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మేడిచర్ల పండు, ఎంపీడీ సత్య, యర్రంశెట్టి చంటి, ఎం వీవేణి, మేడిచర్ల పండు, తెలగరెడ్డి వెంకటలక్ష్మీ, సంఘ నాయకులు పాల్గొన్నారు.

గరగాలమ్మ డ్రెయిన్ సమస్యలు తప్పుతాయి

సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రయిన్‌తో ఉత్పన్నమవుతున్న సమస్యలు త్వరలోనే పూర్తిగా సమసిపోతాయని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శనివారం సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రయిన్ ప్రక్షాళన పనులు పరిశీలించారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రజల వినతి మేరకు ప్రక్షాళన చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ నల్లపరాజు దొరబాబు, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పార్టీ నాయకులు జుత్తిగ దామోదర్, సుతాపల్లి సత్తిబాబు, కుడిపూడి రామకృష్ణ పాల్గొన్నారు.


తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న కాపు సంఘ నాయకులు

నేడు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

యలమంచిలి: హనుమద్ జయంతి సందర్భంగా ఆదివారం చించినాడ నుంచి దొడ్డిపట్ల వరకు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు భజరంగ్‌దళ్ కార్యకర్తలు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు చించినాడ బైపాస్ రోడ్డులో ఉన్న హనుమాన్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ఈ బైక్ ర్యాలీ చించినాడ, యలమంచిలి, మేడపాడు, శిరగాలపల్లి, కట్టుపాలెం, ఇలపకుర్రు, సుంకరపాలెం, గుంపర్రు మీదుగా కాంభొట్లపాలెం వెళుతుంది. అక్కడి నుంచి యూటర్న్ తీసుకుని గుంపర్రు, ఇలపకుర్రు, కుమ్మరిపాలెం, అబ్బిరాజుపాలెం మీదుగా కొనసాగి దొడ్డిపట్ల సెంటర్లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వరకు ఈ బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీ అనంతరం దొడ్డిపట్లలో భక్తులందరికీ అన్నసమారాధన జరుగుతుందని భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు వివరించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ


నరసాపురంలో కేసులు రాజీ చేస్తున్న పదో అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ


పాలకొల్లులో లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి వరలక్ష్మీ

నరసాపురం: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అధాలత్‌లో 691 కేసులు పరిష్కరించినట్టు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. వీటిలో సివిల్ కేసులు 5, క్రిమినల్ కేసులు 668, బ్యాంకు కేసులు18 ఉన్నాయి. మొత్తం 3 బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసులు రాజీ చేశారు. కేసులు రాజీ చేసిన విలువ రూ.65 లక్షలు ఉంటుందని జడ్జి విజయదుర్గ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ఉత్తమ మార్గమన్నారు. రాజీ మార్గమంటే రాజమార్గమన్నారు. జడ్జిలు వై.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కామన బుజ్జి, పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 560 కేసులు పరిష్కరించామని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి తెలిపారు. శనివారం కోర్టుల సముదాయంలో లోక్ అదాలత్ నిర్వహించారు. క్రిమినల్ కేసులు 44, సివిల్ దావాలు 4, మనోవర్తి కేసులు 2, ఇతర కేసులు 6 సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 504 కేసులు మొత్తం 560 కేసులు పరిష్కారం కాగా రూ. 42,15,055 లక్షలు కక్షిదారులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ ఏపీపీ జయసింధు, ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ మనోహరాచారి, పాలకొల్లు పట్టణ, రూరల్ సీఐలు డి.రాంబాబు, కె. శ్రీనివాసు పాల్గొన్నారు.

నేడు 9వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని 9వ వార్డులో ఆదివారం ఉదయం 8గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


డీఎంఅండ్‌హెచ్‌ఓ వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వైద్య ఉద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని జిల్లా వైద్యాధికారి డా.డి మహేశ్వరరావుకి శనివారం వినతిపత్రం అందజేసినట్లు ఎన్జీవో సంఘ పాలకొల్లు యూనిట్ అధ్యక్షుడు గుడాల హరిబాబు తెలిపారు. వైద్య ఉద్యోగులకు చాలా కాలం నుంచి ఎఫ్‌టీఏలు రావడం లేదని, పక్కజిల్లాలైన తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో వైద్య ఉద్యోగులు జీతాలతో పాటు ఎఫ్‌టీఏలు పొందుతున్నారన్నారు. అలాగే 10, 11వ పీఆర్సీలకు సంబంధించి ఎఫ్‌టీఏ బిల్లులను జీతాలతో పాటు చెల్లించాలని ఆ వినతిపత్రంలో కోరారు. అలాగే మునిసిపాల్టీకు మగ ఆరోగ్య కార్యకర్తలను డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారని, అయితే దూర ప్రాంతాలకు డిప్యూటేషన్లు వేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. దగ్గరలోని మునిసిపాల్టీలకు డిప్యూటేషన్ వేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నరసాపురం యూనిట్ కార్యదర్శి కేబీకేఎస్ రమేష్‌రెడ్డి, కోశాధికారి రాజేష్, మాజీ అధ్యక్షుడు కృష్ణకుమార్, కొంగరాపి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జనం బెంబేలు

మొగల్తూరు: మండే ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 8గంటల నుండే సూర్యుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు రోడ్డుపైకి వచ్చేందుకు భయపడిపోతున్నారు. శనివారం ఉదయం పదిగంటలకే జాతీయ రహదారితో పాటు నిత్యం రద్దీగా ఉండే స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నిర్మానుష్యంగా మారిపోయింది. వ్యాపారాలు లేక వ్యాపారస్తులు కూడా తమ దుకాణాలు మూసివేసుకుంటున్నారు. మండే ఎండలతో పాటు వేడిగాలులు బలంగా వీస్తున్నాయి. సాయంత్రం ఐదు గంటలు దాటిన తరువాత జనం రోడ్లపైకి వస్తున్నారు. ఎండలు ఇప్పుడే ఇలా ఉంటే ఈ నెల 25 నుంచి రోహిణీ కార్తె ప్రారంభం కాబోతుంది. రోహిణీలో ఇంకా ఎండలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు.


నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన

ఇరగవరం: తణుకులో చంద్రబాబు నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఇరగవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒక బీసీ వర్గానికి చెందిన మంత్రిపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు శోచనీయమని అన్నారు. రైతుల దగ్గర ఒక్క గింజ ధాన్యం వదలకుండా కొనుగోలు చేస్తున్నా మంత్రి మీద, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మీద నోరు పారేసుకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు.

చిరుద్యోగి నిజాయతీ

వీరవాసరం: విధి నిర్వహణలో ఓ చిరుద్యోగికి దొరికిన రెండు సెల్‌ఫోన్‌లు నిజాయతీగా వీరవాసరం ఎస్సై రమేష్‌కి అప్పగించారు. వీరవాసరం గ్రామానికి చెందిన చిరంజీవి ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. శనివారం ఆయన విధుల నిమిత్తం పలు ప్రదేశాలకు ఆయన వెళ్లారు. ఈ ప్రదేశాల్లో ఆయనకు రెండు సెల్‌ఫోన్లు లభించడంతో వాటిని వీరవాసరం ఎస్సై రమేష్‌కి అప్పగించి నిజాయతీ నిరూపించుకున్నారు.

వెంకన్న ఆలయంలో అన్నసమారాధన

కాళ్ల: మండలంలోని స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు

రాజీ లేకుండా అభివృద్ధి పనులు

ఉండి: నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా జగనన్న గృహాలు నిర్మిస్తున్నామని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు అన్నారు. శనివారం గ్రామంలోని అలుగులమ్మ లేఅవుట్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కొండవేటి సాంబశివరావు, కార్యదర్శి కే గోపాలకృష్ణ, వీఆర్వోఎస్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.